సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

బుధవారం । 24 । సెప్టెంబర్ । 2025



ఫైనాన్సియర్‌ను చంపితే బిజినెస్ పెట్టిస్తా

సుపారీ కల్చర్ ప్రొద్దుటూరుకు పాకింది. తెలంగాణా రాష్ట్రం నుంచి కిరాయి హంతకులను పిలిపించి ఫైనాన్షియర్‌ను హత్య చేయించారు.

-8లో



అసభ్యకర పోస్టులు పెడితే కేసులు

సామాజిక మాధ్యమాలలో ఇతరులను రెచ్చగొట్టేలా, అసభ్యకర వ్యాఖ్యలతో పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ హెచ్చరించారు.

-8లో

గరిష్టం/కనిష్టం
30.9/24.6

వాతావరణం

జిల్లాలో మంగళవారం 24.6 - 30.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

కడప రూరల్: ప్రజా సంఘాలు, మేధావుల ఆధ్వర్యంలో బుధవారం కడప వైఎస్‌ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పంతుల సంపత్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు జరిగే సమావేశంలో ప్రజా సంఘాల నేతలు, వైద్యులు, ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు. వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తే పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నేడు దస్తగిరి షా ఖాద్రి బర్సీ



కమలాపురంలో వెలసిన దర్గా-ఏ-గఫారియా

కమలాపురం: కమలాపురం పెద్దదర్గాగా వెలుగొందుతున్న దర్గా-ఏ-గఫారియాలో బుధవారం రాత్రి దస్తగిరి షా ఖాద్రి బర్సీ నిర్వహిస్తున్నట్లు దర్గా కన్వీనర్, వైఎస్సార్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ షేక్ ఇస్మాయిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 7 గంటలకు స్వామి వారికి పూల చాదర్లు సమర్పించి, అనంతరం గంధం ఎక్కిస్తారని ఆయన అందులో పేర్కొన్నారు. రాత్రి అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. భక్తులు విరివిగా హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వం నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలని జెడ్పీ సీఈఓ ఓబులమ్మ అన్నారు. మంగళవారం జెడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో జెడ్పీటీసీలు, ఎంపీడీఓలు, వ్యవసాయ, డ్వామా అధికారులకు నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ 2.ఓ లక్ష్యాల సాధనకు అందరూ నడుం బిగించాలన్నారు. ఇందుకు సంబంధించిన ఇండికేటర్స్‌లో వెనుకబడి ఉన్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం విషయంలో ఇప్పటికీ అత్యధికంగా వెనుకబడి ఉండడం బాధాకరమని వివరించారు. ఇప్పటికైనా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడం కోసం గ్రామ పంచాయతీ స్థాయిలో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్రమణ్యం, డీపీఓ రాజ్యలక్ష్మి, డీడీఓ మైథిలి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ అడ్మిషన్ల గడువు పొడగింపు

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీఓఎస్ఎస్)లో ఓపెన్ ఇంటర్‌లో అడ్మిషన్లకు అపరాధ రుసుముతో గడువు పొడగించినట్లు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల కోఆర్డినేటర్ చెప్పలి రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఒకే సంవత్సరంలో రెండు సంవత్సరాల కోర్సు పూర్తి చేసుకోవచ్చన్నారు. మా కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులకు సంబంధించి తెలుగు, ఇంగ్లీష్ మీడియం కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కోర్సులో చేరదలచిన విద్యార్థులు రిమ్స్ రోడ్డులోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను సందర్శించి అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ఈ కోర్సులలో చేరేవారికి 16 సంవత్సరాలు పూర్తిగా నిండి ఉండాలని, పదవ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, బ్యాంకు పాసు బుక్కు, క్యాస్ట్ సర్టిఫికెట్, ఫోటో తీసుకొని నేరుగా కళాశాలకు వచ్చి అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. వివరాలకు 91820 99672 సంప్రదించాలని కో ఆర్డినేటర్ రాజారావు తెలిపారు.

కమలానికి మకిలి!

- సిద్ధాంతాలకు తిలోదకాలు .. ఆధిపత్యమే అసలు రంగు
- ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్సెస్ ఎంపీ సీఎం రమేష్
- ఇరువురు అధికారం కోసం ఆరాటం ప్రదర్శించే వారే
- నాడు టీడీపీలోనూ అదే ధోరణి... నేటికీ కొనసాగింపు
- పేకాట నిర్వాహకులంటూ బండారం బయటపెట్టిన సీఎం రమేష్
- ఇప్పటికీ రెండుమార్లు రిత్విక్ సంస్థపై దాడులు చేసిన ఆది వర్గీయులు



సాక్షి ప్రతినిధి, కడప: భారతీయ జనతా పార్టీ నాయకులు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసేవారు. కటిక నేలపై నిద్రించినా ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని ప్రజల మధ్యకు తీసుకెళ్లేవారు. ఇది ఒకప్పుడు మాట. అలాంటి పార్టీలోకి అధికారం కోసం ఆరాట పడే నాయకులు చేరారు. ఆపై ఆధిపత్యపోరాటం తెరపైకి వచ్చింది. బీజేపీ ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిల మధ్య అంతర్యుద్ధం కొనసాగుతూనే ఉంది. వెరశి బీజేపీ నేతలు ప్రత్యక్ష దాడులు, పరస్పర ఫిర్యాదులతో కమలానికి మకిలి పట్టింది.

- కమలం పార్టీ నేతల మధ్య వర్గ పోరు తారాస్థాయికి చేరింది. బీజేపీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యే మధ్య ఆధిపత్య పోరు కూటమి సర్కార్‌కు సమస్యగా మారుతోంది. అనకాపల్లి ఎంపీ రమేష్‌కు చెందిన రిత్విక్ కంపెనీ సిబ్బందిపై జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆది అనుచరులు వరుస దాడి చేయడం కలకలంగా మారింది. ఇద్దరి నేతల మధ్య దశాబ్ద కాలంగా ఉన్న వైరం ఇప్పుడు పతాక స్థాయికి చేరి కూటమి నేతల మధ్య చర్చకు దారితీసింది. ఏపీ బీజేపీలో అగ్రనేతలుగా చలామణి అవుతోన్నా ఇరువురిది జమ్మలమడుగు నియోజకవర్గమే కావడంతో ప్రత్యక్ష పోరు కొనసాగుతోంది.

నాటి నుంచి అదే ధోరణి...

ఎంపీ రమేశ్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మధ్య అంతర్గత పోరు నాటి నుంచే కొనసాగుతోంది. సీఎం రమేష్ రాజ్యసభ సభ్యుడిగా, ఆదినారాయణరెడ్డి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఇరువురి మధ్య అంతర్గత పోరు కొనసాగింది. 2014లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆదినారాయణరెడ్డి తర్వాత టీడీపీ కండువా కప్పుకున్నారు. అయినప్పటికీ ఇరువురి మధ్య సఖ్యత కుదర్లేదు. అప్పట్లో ఆదినారాయణరెడ్డికి చంద్రబాబు మంత్రివర్గంలో అవకాశం దక్కింది. అప్పటికీ కూడా జమ్మలమడుగులో ఆదినారాయణరెడ్డి ఆధిపత్యమే కొనసాగేది. ప్రస్తుతం ఇద్దరూ బీజేపీలోనే ఎంపీ, ఎమ్మెల్యేగా ఉంటున్నా ఎవరి దారి వారిదే అన్నట్లుగానే వ్యవహరిస్తున్నారు. జమ్మలమడుగు మండలంలోని గండికోట పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం సాస్కీ పథకం కింద రూ.79 కోట్లు మంజూరు చేసింది. కాగా, అందులో రూ.50 కోట్ల పనులకు అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ కంపెనీ టెండర్ దక్కించుకుంది. ఇందులో భాగంగా గండికోటలో 2 భవనాలు, రహదారుల విస్తరణ పనులు చేపట్టారు. ఈ పనులు చేయకుండా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అనుచరులు అడ్డుకుంటున్నారు. రెండు వారాల కిందట రెండుమార్లు పనులు అడ్డుకున్న కార్యకర్తలు సోమవారం ఏకంగా దాదాపు 50 మంది వరకు వాహనాల్లో గండికోటకు వెళ్లి రిత్విక్ కంపెనీ సిబ్బందిపై దాడి చేశారు. పోలీసులు పరస్పర కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు.

ఏడాది క్రితం రిత్విక్ సంస్థపై దాడి

ఆదానీ హైడల్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనుల వద్ద ఏడాది కిందట కొండాపురం మండలం దొబ్బుడుపల్లె వద్ద రిత్విక్ సంస్థపై ఎమ్మెల్యే ఆది వర్గీయులు దాడి చేశారు. రూ. 300 కోట్లతో 1000 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మిస్తున్న ఆదానీ పవర్ ప్లాంట్ పనులను ఎర్త్ వర్క్ రిత్విక్ సంస్థ దక్కించుకుంది. ఈ పనులను 2024 నవంబర్‌లో ఎమ్మెల్యే ఆది అనుచరులు అడ్డుకున్నారు. ప్రాజెక్టు కార్యాలయం, షెడ్లపై రాళ్లదాడి చేశారు. అప్పట్లో కొండాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా ఆ తర్వాత గండికోటలో మరోమారు రిత్విక్ సంస్థపై దాడి చోటుచేసుకోవడం విశేషం.

పేకాట నిర్వాహకులంటూ ఫిర్యాదు...

కొండాపురంలో రిత్విక్ సంస్థపై దాడి చేసిన తర్వాత ఎంపీ సీఎం రమేష్ గతంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్, అప్పటి ఎస్పీ అశోక్‌కుమార్‌కు బహిరంగలేఖ రాశారు. రిపబ్లిక్ క్లబ్ పేరుతో జమ్మలమడుగులో విచ్చలవిడిగా జూదం, గ్యాంబ్లింగ్ దేవగుడికి చెందిన నాగేశ్వరరెడ్డి నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. రోజుకు లక్షల్లో జూదం జరుగుతోందని లేఖ రాశారు. సీఎం రమేష్ లేఖతో అప్పట్లో పోలీసులు క్లబ్‌ను మూసివేయించారు. తాజాగా అదే దేవగుడి గ్రామస్తులు గండికోటలో రిత్విక్ సంస్థపై దాడి చేయడంలో కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. పోలీసు కేసు మినహా ఇప్పటికీ ఎంపీ రమేష్ కుటుంబ సభ్యులు నోరుమెదపకపోవడం వెనుక రాజకీయ మంతనాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

వైభవం.. దసరా ఉత్సవం



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో భవానిదేవి అలంకారం



కడప నగరంలోని అమ్మవారిశాలలో శ్రీ రాజరాజేశ్వరీదేవిగా కన్యకాంబ

జిల్లా వ్యాప్తంగా దసరా ఉత్సవాలను అత్యంత వేడుకగా నిర్వహిస్తున్నారు. విశేష అలంకారాలలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆలయాలన్నీ విద్యుత్ దీప కాంతులతో శోభాయమానంగా వెలుగొందుతున్నాయి. ప్రత్యేక సెట్టింగులతో విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఉదయం నుంచి ఆలయాలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. రాత్రి అమ్మవారిని ప్రత్యేక అలంకరణలలో తీర్చిదిద్దుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్, కడప



దేవుని కడపలో శేష వాహనంపై కడప రాయుడు



ప్రొద్దుటూరు కల్చరల్ : రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో భవాని దేవి

వంతెన.. ప్రమాదం అంచున



ఒంటిమిట్ట-భాకరాపేట రైల్వేస్టేషన్ల మధ్య ఉన్న శిథిలావస్థలో ఉన్న రైల్వేబ్రిడ్జి

- ఒంటిమిట్ట-భాకరాపేట మధ్య బ్రిడ్జి శిథిలం
- మృకుందాశ్రమం వద్ద పొంచి ఉన్న ముప్పు



రాజంపేట: గుత్తి-రేణిగుంట డబ్లింగ్‌లో ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం మృకుందాశ్రమం వద్ద ఉన్న రైల్వేవంతెన ప్రమాదకరంగా మారింది. ముంబయి-చెన్నై ప్రధాన రైలుమార్గం.. ఉమ్మడి కడప జిల్లా మీదుగా వెళుతోంది. ఈ మార్గంలో ఒంటిమిట్ట-భాకరాపేట రైల్వేస్టేషన్ల మధ్య మృకుందాశ్రమానికి వెళ్లే రహదారిలో బ్రిడ్జి డేంజర్‌గా మారిందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ బ్రిడ్జి కడప ఇంజినీరింగ్ సెక్షన్ పరిధిలోకి వస్తుంది.

నిత్యం రైళ్ల రద్దీ భారం

ఈ బ్రిడ్జిపై నిత్యం రైళ్ల రద్దీభారం పడుతోంది. ఉమ్మడి కడప జిల్లా మీదుగా నిత్యం 30 రైళ్లకుపైగా రాకపోకలు సాగిస్తుంటాయి. గూడ్స్‌రైళ్లు 40కి పైగా వెళ్తుంటాయి. మృకుందాశ్రమం సమీపంలో ఉన్న బ్రిడ్జి స్థితిగతిని పరిశీలిస్తే.. రైల్వే శాఖ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోందన్న విమర్శలు వెలువడుతున్నాయి. వంతెన పైన, ట్రాక్ కింది భాగంలో నెర్రెలు ఏర్పడ్డాయి. వంతెన పొడవు ఇదే స్థితి కనిపిస్తోంది. అక్కడ మొక్కలు సైతం మొలవడంతో మరింత దెబ్బతింటోంది.

అప్రమత్తం కాకపోతే పెను ప్రమాదం

ఈ వంతెనను పునర్నిర్మాణం చేపట్టకపోతే.. పెను ప్రమాదాలకు దారితీసే పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. వర్షాల సీజన్‌లో నీటి ఊట ఏర్పడి బ్రిడ్జిని మరింతగా దెబ్బతీస్తోంది. ఫలితంగా బ్రిడ్జి స్లాబ్, గోడలు దెబ్బతింటున్నాయి. ఎప్పుడు కూలుతుందో అన్నట్లుగా ఉంది. ఇప్పటికైనా రైల్వే ఇంజినీరింగ్ శాఖ ఈ బ్రిడ్జిని బాగు చేయడంపై దృష్టి పెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

యూసీఐఎల్ సమస్యలను పరిష్కరించాలి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: యూసీఐఎల్‌లో సమస్యలను పరిష్కరించి, పర్యావరణ సహితంగా ప్రాజెక్టును నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో తుమ్మలపల్లి యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(యూసీఐఎల్) సమస్యలపై ప్రాజెక్టు అధికారులు, పులివెందుల డివిజన్ రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూసీఐఎల్ ప్రాజెక్టులో ఎలాంటి భూ, ఇతర సమస్యలు తలెత్తకుండా పరిష్కరించాలని పులివెందుల ఆర్డీఓను ఆదేశించారు. ప్రాజెక్టు పరిధిలోని పునరావాసం కోరుతున్న కే కే కొట్టాల గ్రామాల ప్రజలు, రైతులతో మాట్లాడి సమస్యలను సామరస్యంగా పరిష్కరించాలన్నారు. గతంలో ప్రాజెక్టు కోసం మంజూరైన భూములను త్వరితగతిన వారికి అప్పజెప్పాలన్నారు. ప్రాజెక్టు నిర్వహణ, భద్రతాపరమైన అంశాల్లో ఎలాంటి అలసత్వం వహించరాదన్నారు. యురేనియం గనుల వల్ల పరిసర గ్రామాలు ప్రభావితం కాకుండా చూడాలన్నారు. యురేనియం ప్రాజెక్టు (టైలింగ్) వ్యర్థపదార్థాల నిల్వలు, స్టోరేజ్ సామర్థ్యం వంటి అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ సుమన్ సర్కార్, యుసీఐఎల్ సూపరింటెండెంట్ నవీన్ రెడ్డి , పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య , ఆర్ అండ్ బి డీఈ మాధవి, రెవెన్యూ అధికారులు, పర్యావరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ కిచెన్లను సిద్ధం చేయాలి

పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో అమలైన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్లను మండలాల్లో కూడా అక్టోబర్ 2వ తేదీ నాటికి నిర్మాణాలను పూర్తి చేసి నిర్వహణలోకి తీసుకురావాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో యూనిక్‌గా ఏర్పాటు కానున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ భవన నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ జేసీ అదితిసింగ్ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత శుచిగా, రుచికరంగా, తాజాగా విద్యార్థులకు అందించే దిశగా ప్రతి మండలంలో ఒక ప్రధాన పాఠశాలలో సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ భవనాలను నిర్మిస్తున్నామన్నారు. ఈ షెడ్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేసి, అన్ని పరికరాలను ఏర్పాటు చేసి ట్రయల్ రన్ నిర్వహించాలన్నారు. ఈ నిర్మాణ ప్రక్రియ మొత్తం అక్టోబర్ 2 నాటికి పూర్తి చేసి కిచెన్ షెడ్లను నిర్వహణలోకి తీసుకురావాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఆధునిక వ్యవసాయం లాభదాయకం

ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చవచ్చని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని బోర్డు రూమ్ హాలులో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారులు, ఇఫ్కో(ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కోఆపరేటివ్ లిమిటెడ్) ప్రతినిధులు, సుస్థిర వ్యవసాయ కేంద్రం ప్రతినిధులు, నాబార్డ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద వేముల, వేంపల్లి, ఒంటిమిట్ట మండలాలలో ఇప్పటికే అరటిపంటల్లో ఆధునిక, సాంకేతిక పద్ధతులను అవలంబిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు 1000 ఎకరాల్లో దాదాపు 500 మంది రైతులు ఈ విధానాన్ని పాటిస్తూ మంచి క్వాలిటీ పంటను ఉత్పత్తి చేసి తమ ఉత్పత్తులను ఆ గ్రామంలోనే విక్రయించేలాగా చర్యలు చేపట్టామని తెలిపారు. రాబోవు కాలంలో వీటిని జిల్లా అంతటా విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ చంద్రా నాయక్, ఏపీ ఎంఐపీ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తెల్లబోయింది

- జిల్లాలో పత్తిసాగు అంతంతే..
- పత్తి సాగుకు గడువు ముగుస్తున్నా ముందుకురాని రైతులు
- 24036 హెక్టార్లకుగాను 4986 హెక్టార్లలో మాత్రమే సాగు
- తెగుళ్ల ఉధృతితో పెరుగుతున్న ఖర్చులు, తగ్గుతున్న దిగుబడులు
- మద్దతు కూడా లేని వైనం





ఖాజీపేట మండలంలో సాగులో ఉన్న పత్తిపంట

కడప అగ్రికల్చర్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందే బాగా వర్షాలు కురిశాయి. ఖరీఫ్ సీజన్ సాగు ఆశాజనకంగా ఉంటుందని ఆశ పడిన రైతులకు చివరకు నిరాశే మిగిలింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం తరువాత జూన్, జులై నెలల్లో వర్షాలు పూర్తిగా కునుమరుగయ్యాయి. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ అనుకున్న మేర సాగు జరగలేదు. ఆ తరువాత ఆగస్టు నెలలో అరకొరగా వర్షాలు కురిసాయి. దీంతో ఆరుతడి పంటల సాగు ప్రారంభం అరకొర సాగుతో ముగిసింది. ఖరీఫ్ సాగు ప్రారంభమై మూడు నెలలు దాటినా జిల్లాలో ఇప్పటి వరకు సాధారణ లక్ష్యంలో కనీసం సగం శాతం కూడా పంటలు సాగుకాలేదు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వైఎస్సార్ జిల్లాలో మెట్టప్రాంతాలలో వేంపల్లి, మేముల, రాజుపాలెం, దువ్వూరు, పులివెందుల, ఖాజీపేట, వీఎన్‌పల్లి, ఎర్రగుంట్ల, జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం ఇంకా పలు మెట్ట ప్రాంతాల్లో అధిక విస్తీర్ణంలో పత్తిపంటను ఎక్కువ మంది రైతులు సాగు చేస్తారు. కానీ ఈ ఏడాది అనుకున్న మేర పత్తిపంట సాగు కాక తెల్లబోయారు.

ధర లేకపోవడంతోనే....

పత్తిపంట సాగు తగ్గిపోవడానికి కారణం ఈ ఏడాది సరైన వర్షాలు లేకపోవడం ఒక కారణమైతే మరో కారణం అనుకున్న మేర పత్తికి ధరలు లేకపోవడంతోనే సాగు తగ్గిందని పలువురు రైతులు తెలిపారు. దీంతోపాటు పత్తిపంటకు వర్షాలు సరిగా లేని కారణంగా చీడపీడల బెడద ఎక్కువగా ఉండటంతో రైతులకు మందుల ఖర్చు అధికమౌతుందని తెలిపారు. ఒక వైపు పెట్టుబడి పెరిగి మరోవైపు గిట్టుబాటు ధర లేక రైతులకు శాపంగా మారింది. దీంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారిస్తున్నారు. ఎకరా పత్తి పంట సాగుకు రూ. 50 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చు వస్తుందని రైతులు తెలిపారు. ధర మాత్రం క్వింటాల్ పత్తి రూ. 6 వేల నుంచి రూ.6400 వరకు ధర పలుకుతుంది. పత్తి ఎకరాకు బాగా పండితే 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. అన్ని ఖర్చులు పోను బాగా దిగుబడి వస్తే రూ.10 నుంచి రూ. 15 వేలు మిగులు తుందని .. దిగుబడి సరిగా రాకపోతే సాగు ఖర్చులు రాక నష్టాలను మూటగట్టుకోవాల్సి వస్తుందని అన్నారు.

తగ్గిన సాగు...

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాధారణ సాగు 24,036 హెక్టార్లుకాగా ఇప్పటి వరకు కేవలం 4986 హెక్టార్లకు మించి సాగు కాలే. అంటే జిల్లావ్యాప్తంగా 20.37 శాతం మేరే సాగయింది. పత్తిపంట సాగుకు అనుకూలమైన జూన్, జులై నెల ఆగష్టు నెల కూడా దాటి సెప్టెంబర్ నెల వచ్చింది. ప్రస్తుతం సాగులో ఉన్న పత్తి పంటకు అకాల వర్షాలు , ఎండల తీవ్రతతో అక్కడక్కడ తెగుళ్ల బెడద ఉందని పలువురు రైతులు తెలిపారు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తిపంట సాగు 5000 హెక్టార్లు దాటే పరిస్థితి కూడా లేదు.

ధర లేదు.. సాగు తగ్గించా...



ప్రతి ఏటా నా సొంత పొలంతోపాటు కౌలుకు తీసుకుని 40 ఎకరాల పత్తిపంటను సాగు చేసేవాడిని. అప్పట్లో ధర కొంచెం బాగుండేది. ఖర్చులు పోను ఎకరాకు రూ.20 వేలు మిగిలేది. ఈ ఏడాది కేవలం నా సొంత పొలంలో 5 ఎకరాల్లో పత్తి వేశాను. ఎందుకంటే ధర లేదు.

– ఈశ్వరరెడ్డి, రైతు, తవ్వారుపల్లె, ఖాజీపేట మండలం

క్లుప్తంగా

బాలిక దుర్మరణం


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జి.స్వాతి

కొండాపురం : మండలంలోని కె.సుగుమంచిపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుడ్డాల్ల స్వాతి(13) మృతి చెందారు. తాళ్లప్రొద్దుటూరు ఏఎస్ఐ రాయపాటిబాసు వివరాల మేరకు.. బుక్కపట్నం గ్రామానికి చెందిన జి.అనిల్, వసంత దంపతులకు చెందిన స్వాతి దత్తాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో వతరగతి చదువుతోంది. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో కె.సుగుమంచిపల్లె పునరావాస కేంద్రం సమీపంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద తన బంధువుల అమ్మాయిని ఆటో ఎక్కించి తిరిగి రోడ్డు నుంచి ఎడమవైపు నడచి వస్తోంది. కొండాపురం వైపు నుంచి తాడిపత్రికి వెళ్లే ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలై స్వాతి అక్కడిక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ఆయన తెలిపారు.

ఉపాధ్యాయుడు మృతి


మృతిచెందిన మధుబాబు

జమ్మలమడుగు : మురికి కాలువలో పడి ఉపాధ్యాయుడు మరణించిన సంఘటన జమ్మలమడుగు పట్టణంలో మంగళవారం జరిగింది. పెద్దముడియం మండలం ఎన్.కొట్టాలపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మధుబాబు(50) మద్యం తాగి సోమవారం రాత్రి ఇంటికి బయలుదేరాడు. మద్యం ఎక్కువగా తాగడంతో నడవలేని స్థితిలో కన్నెలూరు మోటు వద్ద మురికి కాలువలో పడి పోయాడు. ఎవ్వరూ గుర్తించకపోవడంతో అక్కడే మృతిచెందాడు. ఉదయం స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని కాలువలో నుంచి బయటికి తీసి పోర్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

రిమ్స్ మార్చురీలో మూడు మృతదేహాలు

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)లో వైద్య సేవలను పొందేందుకు వచ్చిన ముగ్గురు వేర్వేరు గుర్తుతెలియని వారు మృతి చెందారు. ఆయా మృతదేహాలను కడప రిమ్స్ మార్చురీలో వుంచారు. ఆచూకీ తెలిసిన వారు తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని రిమ్స్ అధికారులు తెలియజేశారు.

సోలార్ కంపెనీలో చోరీ

కొండాపురం : మండలంలోని టి.కోడూరు సమీపంలోని సెయిల్ కంపెనీలో మరో చోరీ జరిగినట్లు తాళ్లప్రొద్దుటూరు ఏఎస్ఐ బాసు తెలిపారు. ఏఎస్ఐ వివరాల మేరకు సెయిల్ కంపెనీలో సోలార్‌కు ఉపయోగించే 32 బ్యాటరీలు చోరీకి గురైనట్లు సెయిల్ కంపెనీ సెక్యూరిటీ ఇన్‌ఛార్జి ఫిర్యాదు చేశారెు. వాటి విలువ సుమారు రూ.1.92 లక్షలు ఉంటుదని ఏఎస్ఐ తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

పోరుమామిళ్ల : కవలకుంట్ల వద్ద మద్యం సీసాలు తీసుకెళ్తున్న ఎదుర్ల నాగేంద్ర (40)ను మంగళవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. దాసరిపల్లెకు చెందిన నాగేంద్ర ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వాహన చోదకుడి అరెస్టు

పోరుమామిళ్ల చెక్ పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. మంగళవారం ఓ వ్యక్తి మద్యం తాగి బైక్‌నడుపుతూ వచ్చారు. బ్రీత్ అనలైజర్‌తో చెక్ చేయగా నడుపుతున్న వ్యక్తి మద్యం తాగినట్లు తేలడంతో బైక్ సీజ్ చేసి అతనిపై కేసు నమోదుచేశారు.


అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం

కడప సెవెన్‌రోడ్స్ : పాట్నాలో నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్న అంతర్జాతీయ సాహితీ సదస్సుకు తెలుగుభాషా విభాగం నుంచి జిల్లాకు చెందిన డాక్టర్ వేంపల్లె గంగాధర్‌కు ఆహ్వానం అందింది. ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు పాట్నాలోని సామ్రాట్ అశోక్ సమావేశ భవనంలో దేశ విదేశాలకు చెందిన పలువురు సాహిత్య సాంస్కృతిక కళాకారులు ఈ సదస్సుకు హాజరు కానున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం.. పండితులకు శాపం

పండితుల పదోన్నతులపై ఆరేళ్లుగా ఊరించి.. ఇపుడు అట్టకెక్కించారు. భాషోపాధ్యాయులకు ఇష్టం లేకపోయినా ఏడాదికో మారు భార్య, పిల్లలు, తల్లిదండ్రులకు దూరంగా ఎక్కడిపడితే అక్కడికి బదిలీలు చేసి మానసికంగా ఇబ్బంది పెడుతున్నారు. వందల కిలోమీటర్ల దూరానికి జిల్లాలు మార్చి బదిలీలు చేస్తూ వారిని బలి పశువులు చేస్తున్నారు. తమ పిల్లల చదువులకు బ్రేకులు పడతున్నా భరిస్తూ.. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

- పదోన్నతుల కోసం పదేళ్లుగా పండితుల పాట్లు
- ఏడాదికోమారు మారుమూల ప్రాంతాలకు బదిలీ
- సుప్రీంకోర్టు ఆదేశాలను లెక్కచేయని కూటమి ప్రభుత్వం


ఈ నెల 4న పదోన్నతులు కల్పించాలని డిక్లరేషన్ ఇచ్చేందుకు వచ్చిన బాషా పండితులు

బద్వేల్ : రాష్ట్ర వ్యాప్తంగా 2019లో భాషోపాధ్యాయుల(తెలుగు,హిందీ,ఉర్దూ,సంస్కృతం,కన్నడ) పదోన్నతులు జరిగాయి. 13 ఉమ్మడి జిల్లాల్లో 1134 మంది మిగిలి పోగా వైఎస్సార్ కడప జిల్లాలో 114 మంది డీఈఓ పూల్‌లో ఉన్నారు. వీరిలో తెలుగు పండితులు 68, హిందీలో 33, ఉర్దూలో 13 మంది ఉన్నారు. ప్రస్తుతం వీరిది విద్యా శాఖలో ఏ విభాగమో అర్థంకాకుండా పోయింది. ఫలితంగా ఏడాదికో మారు జిల్లా నుంచి జిల్లాకు, కనీస వసతులు లేని మారుమూల గ్రామాలకు బదిలీ చేసి బలితీసుకుంటున్నారు.

సుప్రీంకోర్టు ఉత్తర్వులు అమలుకానివైనం

ఆరేళ్లుగా ఏడాదికోమారు బదిలీలతో విసిగి వేసారిన భాషాపండితులు ఏదో చోట ఎనిమిదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో 1134 మంది బాషోపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించారు. వారి బాధలను క్షుణంగా పరిశీలించిన హైకోర్టు ధర్మాసనం సింగిల్ బెంచ్ జడ్జి మన్మధరావు వెంటనే పదోన్నతులు కల్పించాలని, సమాన పనికి తగిన వేతనం ఇవ్వాలని 20 డిసెంబర్, 2024లో తీర్పు ఇచ్చారు. అయితే హైకోర్టు ఆదేశాలు జారీచేసి తొమ్మిది నెలలు కావస్తున్నా కూటమి ప్రభుత్వం అమలు చేయలేదు. పదోన్నతుల అమలులో తాత్సారం చేయడంతో భాషోపాధ్యాయులు నష్టపోతగున్నారు. తమకు పదోన్నతులు కావాలని సెకండ్ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీలు) ఇటీవల కోర్టును ఆశ్రయించారు. ఫలితంగా కోర్టు యథాస్థితి కొనసాగించాలని ఆదేశించింది. అనంతరం భాషా పండితులు కోర్టును ఆశ్రయించగా హైకోర్టు ధర్మాసనం సెప్టెంబర్ 2న స్టేటస్ కో ఎత్తివేసింది.

ఉసూరుమనిపించిన ప్రభుత్వం: హైకోర్టు ధర్మాసనం స్టేటస్‌కో ఎత్తివేసిన వెంటనే భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వం సంకల్పించి సెప్టెంబర్ 4న (ఈ నెల) అన్ని జిల్లాల విద్యాశాఖాధికారుల కార్యాలయాల్లో దరఖాస్తు సమర్పించుకోవాలని సూచించింది. ఎన్నో ఏళ్ల కష్టానికి ఫలితం దక్కిందనే ఆశతో బాషోపాధ్యాయులంతా డీఈవో కార్యాలయాల్లో డిక్లరేషన్ రాసిచ్చారు. తమకు పదోన్నతి ఉత్తర్వులు వస్తాయని ఆశపడే సమయంలో కూటమి ప్రభుత్వం మరల మెలికపెట్టి ఆ ప్రక్రియను ఆపేసింది. ప్రభుత్వ ఉద్యోగంలో సర్వీసు ఉన్న వారికి పదవీ విరమణ చేసేలోగా రెండు పదోన్నతులు కల్పించాల్సి ఉంది. బాషా పండితుల విషయంలో దశాబ్ద కాలంగా ఇది అమలు చేయడంలేదు. ఇరవై ఏళ్ల కిందట చేరిన వారు కూడా పదోన్నతి లేకుండానే పదవీవిరమణ పొందారు.

ప్రాథమిక హక్కు కోల్పోయాం



రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు కొల్పోయాం. ఉద్యోగులందరూ పొందే బదిలీ హక్కు కోల్పోయాం. డీఎస్సీ నియామకాలు జరిగినా, సాధారణ బదిలీలు జరిగినా మారుమూల ప్రాంతాలకు బలవంతంగా బదిలీ చేశారు. రేషనలైజేషన్ ,డిప్యూటేషన్, వర్క్ అడ్జస్ట్‌మెంట్ అంటూ బాషా పండితులను మాత్రమే వేధిస్తున్నారు. ఇంకా ఈ బాధలు పడలేం. ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి.
– కె.స్వతంత్రబాబు, బాషా పండితుడు, వైఎస్సార్ కడప జిల్లా

మీరు అడిగినట్లు డిక్లరేషన్ ఇచ్చాం



విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఏ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నామో తెలుపుతూ పదోన్నతి కోసం ఈ నెల 4న ఆయా జిల్లా విద్యాశాఖాధికారులకు డిక్లరేషన్ ఫారాలు సమర్పించాం. అయినా మరల పదోన్నతులకు బ్రేక్ వేశారు. 90 రోజులలోగా న్యాయస్థానం తీర్పును అమలు చేయలేకపోయారు. కొన్ని ఇబ్బందులు కారణంగా ఆగాయి. ప్రస్తుతం ఎటువంటి ఆటంకాలు లేవు. మాకు న్యాయం చేయాలి.
– రాజారావు, తెలుగు పండితులు, కర్నూలు

హామీలు నెరవేర్చండి



సీఎం, డిప్యూటీ సీఎం ఆరు నెలల కిందట హామీ నెరవేరుస్తామని చెప్పారు. ఇంతవరకూ పట్టించుకోలేదు. ఇదిగో.. అదిగో అంటూ ఆశలు కల్పించి ఉసూరు మనిపిస్తున్నారు. ఆరు సంవత్సరాల నుంచి క్యాడర్ లేకుండా పనిచేస్తున్నాం. ఎక్కడి వేస్తే అక్కడికి భార్య, బిడ్డలను వదలి కిమ్మనకుండా వెళ్తున్నాం. ఇప్పటికైనా దయ ఉంచి పదోన్నతులు కల్పించి శాశ్వత స్థానాలు కేటాయించాలని కోరుకుంటున్నాం.
– పి.కిరణ్‌కుమార్, ల్యాంగ్వేజ్ పండిట్, అన్నమయ్య జిల్లా

అటవీ శాఖ గార్డు.. టీచర్ అయ్యాడు

11వ ర్యాంకుతో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం


రాజశేఖర్‌రెడ్డి

కడప సిటీ : అటవీ శాఖలో చిరుద్యోగిగా పనిచేస్తూనే.. కష్టపడి చదివి ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. కఠోర సాధన చేసి డీఎస్సీలో 11వ ర్యాకు సాధించి భళా అనిపించాడు. పెండ్లిమర్రి మండలం యల్లటూరు గ్రామానికి చెందిన గుర్రంపాటి రాజశేఖర్‌రెడ్డి కడప రాజేశ్వరీ కళాశాలలో బీఈడీ పూర్తి చేశారు. నిరుద్యోగం వెంటాడుతుందనే భయంతో అటవీ శాఖలో గార్డు ఉద్యోగానికి దరఖాస్తు చేసి ఎంపికయ్యాడు. 17 ఏళ్లుగా వేంపల్లె అటవీ రేంజ్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. అనంతరం గార్డు ఉద్యోగం చేస్తూనే 2014, 2019లో డీఎస్సీ రాశాడు. 2019లో 14వ ర్యాంకు వచ్చినా ఆరు పోస్టులు ఉండడంతో ఎంపికకాలేదు. అనంతరం తాజాగా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో గార్డు ఉద్యోగానికి సెలవు పెట్టి ఇటీవల జరిగిన డీఎస్సీ పరీక్ష రాశాడు. 11వ ర్యాంకు సాధించడంతో ఓసీ విభాగంలో స్కూల్ అసిస్టెంట్(సోషల్)గా ఎంపికయ్యాడు. అధికారులు, కుటుంబ సభ్యుల సహకారంతో ఈ విజయం సాధించానని రాజశేఖర్‌రెడ్డి సాక్షికి తెలిపారు. 2019 డీఎస్సీకి ముందు 42 ఏళ్ల వయోపరిమితిని 2019లో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 44 ఏళ్లకు పెంచిందని, దీంతో వేల మంది రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఏర్పడిందని అతడు తెలిపారు.

అసభ్యకర పోస్టులు పెడితే కేసులు

ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్


మాట్లాడుతున్న ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

కడప అర్బన్ : సామాజిక మాధ్యమాలు వేదికగా ఇతరులను రెచ్చగొట్టేలా, అసభ్యకర వ్యాఖ్యలతో పోస్టులు పెడితే వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు అరెస్టు చేసి జైలుకు పంపుతామని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ హెచ్చరించారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలికలు, అధికారులపై పోస్టులు పెడుతున్నట్లు ఫిర్యాదులు అందాయని, వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. అసభ్యకర రీతిలో పోస్టులు పెట్టినా, కులాలు, వర్గాలు, వ్యక్తిగత దూషణలు, రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సోషల్ మీడియా పోస్టులపై గట్టి నిఘా ఉంచి పర్యవేక్షిస్తామన్నారు. యువత సామాజిక మాధ్యమాలకు మంచికోసమే వినియోగించాలని ఎస్పీ సూచించారు. ఎవరైనా బాధితులు ఉంటే ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన kadapasocialmedia@gmail. com, లేదా సెల్ నెంబర్ 9121100686కు నేరుగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. యవచ్చనీ ఎస్పీ తెలియజేశారు. ఈ సమావేశంలో ఏఎస్పీ(అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు, ఎస్‌బీ డీఎస్పీ ఎస్.సుధాకర్, దారెడ్డి భాస్కర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నష్టాలను తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గురవయ్య

కడప కార్పొరేషన్ : విద్యుత్ సరఫరాలో నష్టాలను పూర్తిగా తగ్గించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్(టెక్నికల్) కె.గురవయ్య సూచించారు. కడప డివిజన్ కార్యాలయంలో కడప, వల్లూరు, పెండ్లిమర్రి, చింతకొమ్మదిన్నె, సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సంతృప్తి స్థాయి కేవలం 59.53% మాత్రమే ఉండడం ఆందోళనకరమన్నారు. వినియోగదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ, వారి సమస్యలను శ్రద్ధగా విని పరిష్కరించాలన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్ పొందే అవకాశాన్ని ఆయన వివరించారు. తక్కువ వడ్డీ రేటుతో బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయని, రూ.98,000 వరకు సబ్సిడీ ప్రోత్సాహకాలు లభిస్తున్నాయని తెలిపారు. ప్రజలలో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. లో వోల్టేజ్ సమస్యల నివారణకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయాలని, విద్యుత్ అంతరాయాలను అరికట్టి, నిరంతర సేవలు అందించాలన్నారు. అనంతరం బాలాజీనగర్ సబ్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ఎస్ఈ యస్.రమణ, హరిసేవ్యానాయక్, రమణారెడ్డి పాల్గొన్నారు.

సెలవులు ఇవ్వకుండా వేధిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలి


డీఈఓకు విన్నవిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఉపాధ్యాయులకు సెలవు ఇవ్వకుండా వేధిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. డీఈఓ షంషుద్దీన్‌ను మంగళవారం ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీచింగ్ స్కిల్, వర్క్‌షాప్, డెవలప్‌మెంట్ పేరుతో నారాయణ, చైతన్య, జీఎంఆర్ విద్యా సంస్థల యాజమాన్యాలు సెలవుల్లో స్కూల్‌కు రావాలని, లేకుంటే తొలగిస్తామని బెదిరిస్తున్నారన్నారు. చాలీ చాలని జీతాలిస్తూ ప్రైవేటు ఉపాధ్యాయులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజయ్, పెద్దన్న పాల్గొన్నారు.

ఫైనాన్షియర్‌ను చంపితే బిజినెస్ పెట్టిస్తా

- కిరాయి హంతకులకు ఆఫర్ ఇచ్చిన సూత్రధారులు
- వారితోనే వేణుగోపాల్‌రెడ్డిని హత్య చేయించిన దుండగులు



హత్య జరిగింది ఈ ఆర్చీ వద్దనే

ప్రొద్దుటూరు క్రైం : సుపారీ కల్చర్ ప్రొద్దుటూరుకు ప్రాకింది. తెలంగాణా రాష్ట్రం నుంచి కిరాయి హంతకులను పిలిపించి ఫైనాన్షియర్‌ను హత్య చేయించారు. ఇటీవల జరిగిన ఫైనాన్స్ వ్యాపారి వేణుగోపాల్‌రెడ్డి హత్య పట్టణంలో సంచలనం కలిగించింది. హైదరాబాద్‌కు చెందిన కిరాయి హంతకులు ఈ హత్య చేశారని తెలియడంతో ప్రొద్దుటూరు వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ముంబై, ఢిల్లీ, బీహార్ తదితర రాష్ట్రాలకు పరిమితమన సుపారీ కల్చర్ ఇప్పుడు ఈ ప్రాంతానికి ప్రాకడంతో పసిడిపురిలో అలజడి మొదలైంది. ఈ నెల 19న రాత్రి వడ్డీ వ్యాపారి వేణుగోపాల్‌రెడ్డి హత్య జరిగిన తర్వాత పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. దర్యాప్తులో ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగు చూసినట్లు తెలుస్తోంది.

మూడు నెలల క్రితమే హత్యకు ప్రణాళిక..

వేణుగోపాల్‌రెడ్డి హతమార్చిన ఘటనలో ఇరువురు బాకీ దారులే ప్రధాన సూత్రదారులు. ఇరువురు వడ్డీ వ్యాపారిని హత్య చేయడానికి మూడు నెలల క్రితమే ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తోంది. వీరిలో ఒక వ్యక్తి గతంలో పట్టణంలోని వైఎంఆర్ కాలనీలో చిల్లర దుకాణం నిర్వహించాడు. దుకాణాన్ని ఎత్తేసిన అతను కొన్ని నెలల నుంచి హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. హైదరాబాద్‌లో ఒక ప్లాట్ కొనుగోలు చేశాడు. హైదరాబాద్‌కు వెళ్లినప్పుడు ఆ ప్లాట్‌లోనే ఉండేవాడు. హైదరాబాద్‌లో ఉన్న మరో యువకుడిని అతడు సహాయకుడిగా పెట్టుకున్నాడు. ప్రొద్దుటూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లిన ప్రతిసారీ సహాయకుడే పికప్ చేసుకొని ప్లాట్‌కు తీసుకెళ్లేవాడు. సహాయకుడికి డబ్బు అవసరం ఉండటంతో రూ.80 వేల వరకూ ఇచ్చాడు. నెల రోజుల క్రితం తనకు ఒక పని చేసి పెట్టాలని బాకీ దారు తన సహాయకుడిని అడిగాడు. ×ఒక వ్యక్తిని చంపాలి.. ఈ పని చేసి పెడితే నీ లైఫ్ సెటిల్ చేస్తా.. లేదంటే బిజినెస్ పెట్టిస్తా¥ అన్నాడు. అతని ఆఫర్‌కు హైదరాబాదీ అంగీకరించాడు. తొలిసారి వినాయకచవితి పండగ సమయంలో హైదరాబాద్ నుంచి తన సహాయకుడ్ని తీసుకొని ప్రొద్దుటూరుకు వచ్చాడు. జమ్మలమడుగు రోడ్డులోని బొల్లవరం ప్లాట్ వద్దకు వెళ్లి ఫైనాన్షియర్ ఇల్లు చూపించాడు. స్కూటీలో ఇంటికి వచ్చి పోయే సమయంలో పలుమార్లు వేణుగోపాల్‌రెడ్డిని చూపించి గుర్తు పెట్టుకోమని చెప్పాడు. దీంతో అతడి సహాయకుడు హైదరాబాద్‌కు వెళ్లి తనకు తెలిసిన మరో ముగ్గురిని వెంట పెట్టుకొని ఈ నెల 19న కారులో ప్రొద్దుటూరుకు వచ్చారు. ఇక్కడికి వచ్చిన తర్వాత సూత్రదారులు ఇద్దరు కిరాయి హంతకులకు ఖర్చుల కోసం రూ. 23 వేలు ఇచ్చినట్లు తెలుస్తోంది. అదే రోజు రాత్రి వేణుగోపాల్‌రెడ్డి స్కూటీలో ఇంటికి వెళ్లే సమయంలో అడ్డగించి, కళ్లలో కారం చల్లి హైదరాబాద్‌కు చెందిన హత్య చేసిన విషయం తెలిసిందే. హత్య చేయడానికి కిరాయి హంతకులు పెద్ద మొత్తంలో ఒప్పందం కుదుర్చుకుంటారు. అడ్వాన్స్‌గా లేదా ఏక మొత్తంలో డబ్బు తీసుకొని పనిముగిస్తారు. అయితే ఇక్కడ మాత్రం సూత్రధారులు హైదరాబాదీ కిరాయి హంతకులకు బిజినెస్ పెట్టిస్తాననే ఆశ చూపి వేణుగోపాల్‌రెడ్డిని చంపించారు. ఇద్దరు బాకీదారులు ఫైనాన్షియార్‌ను హత్య చేయించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇతర బాకీదారుల ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

కడప రూరల్ : ఔట్ సోర్సింగ్ పద్ధతిన డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ఖాళీలు, దరఖాస్తు నమూనా, నెలసరి వేతనం ఇతర వివరాలను www.kadapa.ap.gov.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చన్నారు. అర్హులైన వారు దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని సర్టిఫికెట్లను జతచేసి ఈ నెల 29వతేదీ సాయంత్రం 5 గంటల్లోపు కడప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వ్యక్తిగతంగా అందజేయాలని సూచించారు. ఇది వరకే ల్యాబ్ టెక్నిషియన్, ఫార్మసిస్టు, ఎఫ్ఎన్ఓ, శానిటరీ అటెండర్ అండ్ పీవీ హెల్త్ విజిటర్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు.

స్థలం విషయంలో ఘర్షణ


గాయపడిన ప్రతాప్‌రెడ్డి

ముద్దనూరు : స్థలం వివాదంలో జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని కొసినేపల్లె గ్రామానికి చెందిన శివ ప్రతాప్‌రెడ్డికి అదే గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డికి ఇంటి వద్ద స్థల వివాదం ఉంది. ఈ విషయంపై మంగళవారం ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో భాస్కర్‌రెడ్డి, అతడి భార్య, కుమారుడు, మరోవ్యక్తి రామిరెడ్డి కలిసి శివప్రతాప్‌రెడ్డిపై కట్టెలు, ఇనుప రాడ్‌తో దాడిచేశారు. ఈ దాడిలో శివప్రతాప్‌రెడ్డికి రక్తగాయాలవడంతో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొర్రపాడు రోడ్డులో చైన్ స్నాచింగ్


చైన్ స్నాచింగ్‌కు గురైన మహిళ

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని కొర్రపాడు రోడ్డులో మంగళవారం రాత్రి చైన్ స్నాచింగ్ జరిగింది. గోకుల్ నగర్–1కు చెందిన బి విజయలక్ష్మి మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తి బంగారు చైన్ లాక్కొని బైక్‌లో పారిపోయాడు. స్థానికులు తెలిపిన మేరకు.. దసరా పండగ సందర్భంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు జరుగుతుండటంతో విజయలక్ష్మి, మరో ఇద్దరు మహిళలతో కలిసి ఆలయాలకు బయలుదేరారు. వారు కొర్రపాడు రోడ్డులోని రమణమహర్షి స్కూల్ సమీపంలోకి వెళ్లేసరికి ముఖానికి మాస్క్ పెట్టుకున్న ఒక వ్యక్తి పల్సర్ బైక్‌లో వచ్చి ఆమె మెడలోని మూడు తులాల బంగారు చైన్ లాక్కొని వెళ్లిపోయాడు. అతను బైక్‌లో వేగంగా కొర్రపాడు రోడ్డులోని భగత్‌సింగ్ కాలనీ వైపు వెళ్లినట్లు ఆమె తెలిపారు. టూటౌన్ సీఐ సదాశివయ్య ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. దర్శనానికి వెళ్లే మహిళలు బంగారు ఆభరణాలు ధరించవద్దని, ఒక వేళ ఆభరణాలు ధరించినా నగలు కనిపించకుండా చీర కొంగు కప్పుకోవాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. ఈ మేరకు విజయలక్ష్మి టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

తిరస్కరించిన వారినే.. తీసుకొచ్చారు

- టీడీపీ కడప నగర నూతన కమిటీ నియామకం
- పార్టీకి పనిచేసిన వారిని పక్కన పడేశారని అసంతృప్తి
- తమ్ముళ్ల తిరుగుబాటు వేళ నిర్ణయంపై ఆగ్రహం


విలేకరులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సూర్యనారాయణ

కడప రూరల్ : కడప నగరం తెలుగుదేశం పార్టీలో రాజకీయాలు గరంగరంగా మారాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే మాధవీరెడ్డి నిర్ణయాలపై ఆ పార్టీ కార్యకర్తలు బహిరంగంగానే వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక పాతకడప కృష్ణారెడ్డి నేతృత్వంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు కమలాపురానికి వెళ్లి తమకు న్యాయం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డిని శరణు కోరడంతో పెద్ద దుమారమే రేగింది. అనంతరం పార్టీని ఫిరాయించిన కార్పొరేటర్లు కూడా పాత కడప కృష్ణారెడ్డిపై విరుచుకుపడ్డారు. ఇదిలా ఉన్నా.. పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి కడప నగర నూతన కమిటీని నియమించారు. నగర అధ్యక్షుడిగా పఠాన్ మన్సూర్ అలీఖాన్, ఉపాధ్యక్షుడిగా పసుపులేటి గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ముక్కా సుబ్బారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బోనం వెంకటేశ్, గండ్లూరి బాబా ఫక్రుద్దీన్, ఇప్పిరాల పూర్ణచంద్రరావు, కార్యదర్శులుగా కోనేటి వెంకటేశ్ ఆచారి, గోగుల శ్రీనివాసులు, జి.నరేష్, కోశాధికారిగా మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలను నియమించారు. దీంతో తమ్ముళ్ల వివాదానికి మరింత ఆజ్యం పోసినట్లైంది. ఇదివరకే నగర కమిటీ వ్యవహారంపై పార్టీ అధిష్టానం కార్యకర్తల అభిప్రాయాలను సేకరించింది. చాలా మంది అభ్యర్థుల పట్ల వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఈ కమిటీని అధిష్టానం 'రిజెక్ట్' చేసిందనే ప్రచారం జరిగింది. తీరా చూస్తే వారినే కొత్త కమిటీలో చేర్చడంతో తమ్ముళ్ల అసంతృప్తి సెగలు ఎగసిపడ్డాయి. పార్టీ ఫిరాయించిన వారితోపాటు టీడీపీలో గుర్తింపు లేని వారికి చోటు కల్పించడం దారుణమని కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. తాము తిరస్కరించినా, తమ పంతం, ఆధిపత్యం కోసం కమిటీ నియమించారని తమ్ముళ్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి పార్టీకి సేవలు చేసిన కార్యకర్తలను పక్కన పడేశారని ఆరోపిస్తున్నారు.

తప్పు చేయొద్దంటే...తిరుగుబాటు చేస్తావా

– పాత కడప కృష్ణారెడ్డిపై విరుచుకుపడిన కార్పొరేటర్లు

పాత కడప కృష్ణారెడ్డి చేయని అక్రమాలంటూ లేవు.. టీడీపీలో ఉంటూ ఆయన ఒక్కడే లబ్ధి పొందాడు.. ఇపుడు తప్పు చేయవద్దంటే తిరుగుబాటు చేస్తున్నాడు అని పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లు సూర్యనారాయణ, సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మంగళవారం వారు మాట్లాడుతూ కృష్ణారెడ్డి సొసైటీ డైరెక్టర్‌గా పదవి అనుభవిస్తూ పార్టీపైనే విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రెవెన్యూ శాఖలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని, సొంత కుటుంబ సభ్యుల ఆస్తులను కాజేసిన నైజం కృష్ణారెడ్డిదని దుయ్యబట్టారు. డీలర్లను కూడా వదలిపెట్టలేదన్నారు. అభివృద్ధిని ఆకాంక్షించి తాము టీడీపీలో చేరామని, ఇపుడు అభివృద్ధిచూసి ఓర్వలేక కృష్ణారెడ్డి ఆరోపణలు చేయడం తగదన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే మాధవీరెడ్డి వద్ద ఉంటూ పెద్ద ఎత్తున లబ్ధి పొందారని వారు ఆరోపించారు. కడపలో ఏదో జరుగుతోందని కృష్ణారెడ్డి తన అనుచరులను వెంటేసుకుని పెద్దాయన పుత్తా నరసింహారెడ్డి వద్దకు వెళ్లారన్నారు. ఆయనకు కడపలో జరుగుతున్న అంశాలపై పెద్దగా తెలియదన్నారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ నిత్యం అక్రమాలకు పాల్పడే నువ్వు మమ్మల్నే బెదిరిస్తావా....రా చూసుకుందాం అంటూ కృష్ణారెడ్డికి సవాల్ విసిరారు. కార్యక్రమంలో జప్రుల్లా, చల్లా రాజశేఖర్, బాలకృష్ణారెడ్డి, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

ఐకార్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులు ప్రియాంక, షర్మిల,సాయిదీప్తి, హర్ష, షకీనా, నితిన్

పులివెందుల : జాతీయ స్థాయిలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐకార్) నిర్వహించిన పీజీ (ఏఐఈఈఏ) పరీక్షలో తమ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ తెలిపారు. పట్టణంలోని డీన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఐకార్ ఫలితాల్లో కళాశాలకు చెందిన ప్రియాంక దేశ వ్యాప్తంగా 3వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో సాయిదీప్తి 22, షర్మిల 42, ఎస్సీ కేటగిరీలో షకీనా 43, హర్షవర్ధన్ 81, ఎస్టీ కేటగిరీలో నితిన్ 24వ ర్యాంకులు సాధించారన్నారు. రాబోయే సంవత్సరంలో ఈ పోటీ పరీక్షల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షిస్తూ విద్యార్థులను అభినందించారు. ఈ ఏడాది నుంచి పులివెందుల ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎంటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సు ప్రారంభిస్తున్నామని తెలిపారు. దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని ఈనెల 30వతేదీలోగా ఇవ్వాలన్నారు.